క్లుప్తంగా

హిందీపై పట్టు అవసరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : మాతృభాషతోపాటు హిందీపై పట్టు అవసరమని ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎస్వీయూలో హిందీ సప్తహ్– హిందీ భాష, వర్తమాన సమయ్ కీ చునౌతియా ఔర్ సంభావనాయే అనే అంశంపై ఒక్క రోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ హిందీ నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వెల్లడించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నారాయణ రాజు, అన్నామలై యూనివర్సిటీ ప్రొఫెసర్ జగన్నాథ రెడ్డి, హిందీ విభాగం అధిపతి ఆచార్య నారాయణ, డీన్ ప్రొఫెసర్ మురళీధర్ పాల్గొన్నారు.

ఆధునిక అవసరాలకు పరిశోధనలు



అతిథులను సన్మానిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఆధునిక కాలంలో వ్యవసాయం, పరిశ్రమలు, వైద్యం, ఆరోగ్యం, పర్యావరణం తదితర రంగాల్లో అవసరాలు తీర్చేందుకు విస్తృత పరిశోధనలు చేపట్టాలని డాక్టర్ అరుణ్ తెలిపారు. శనివారం ఎస్వీయూ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మెటల్ కాంప్లెక్స్ అండ్ ఇంక్రీజింగ్ ఇంపార్టెన్స్ ఇన్ బయలాజికల్ అప్లికేషన్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.మెటీరియల్ విభాగం డాక్టర్ అరుణ్ మాట్లాడుతూ ఈ మేరకే దేశంలోని విశ్వవిద్యాలయాలు, సంస్థలలో విస్తృత స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మావతి, రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పద్మజ, అధ్యాపకులు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, డాక్టర్ గీత, డాక్టర్ ఆదిశేషు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ



యూనిఫామ్ అందిస్తున్న లింగయ్యనాయుడు

పాకాల : స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 30 మంది విద్యార్థులకు కాలేజీ పూర్వ విద్యార్థులు యూనిఫామ్‌ను వితరణగా అందించారు. శనివారం ఈ మేరకు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వై.లింగయ్యనాయుడు మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో ఉండాలని, మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రిన్సిపల్ వి.ఉమామహేశ్వరి, సంఘం కోశాధికారి జీవీ ప్రసాద్, అధ్యాపకులు జయచంద్రన్, హరనాథ్ ఆచ్చారి, చెంగల్రాజు, మునిరాజా పాల్గొన్నారు.

ముగిసిన 'ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్'



గ్రోత్ కారిడార్‌లో అధ్యాపక బృందం

తిరుపతి రూరల్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారం ముగిసింది. ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ అకడమిక్ ప్రోగ్రాం కింద ''క్వాంటమ్ కంప్యూటింగ్, సాంకేతికతలో తాజా పరిణామాలు'' అనే అంశంపై వారం రోజులు పాటు ఈ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా కళాశాల అధ్యాపకులు చిత్తూరు అమరరాజ గ్రోత్ కారిడార్‌ను సందర్శించారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ పి.వెంకటకృష్ణ, ప్రొఫెసర్ వి. సారిత, అధ్యాపకులు తమ అనుభవాలను పంచుకున్నారు.

పవిత్రం..పెరటాసి మాసం



అలిపిరి వద్ద భక్తుల సందడి



పాదాల మండపంలో పిండి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఏడుకొండలస్వామి సేవకు భక్తజనం పోటెత్తింది. పెరటాసి మాసం సందర్భంగా తిరుమలేశుని దర్శనానికి తరలివచ్చింది. పాదాల మండపంలో పిండి దీపం వెలిగించి పునీతమైంది. కాలినడకన శ్రీవారిని సన్నిధికి బయలుదేరి భక్తిప్రపత్తులను చాటుకుంది. మెట్టు మెట్టుకు ప్రణామం చేసుకుంటూ పులకించింది. వైకుంఠనాథుడు అవతరించిన మహిమాన్విత ఘడియను స్మరించుకుంటూ పరవశించింది. ఈ క్రమంలోనే పవిత్ర శనివారం రోజున తిరుగిరులతోపాటు వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించింది. దేవదేవుని కనులారా వీక్షించి తరించింది.

- భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- కాలినడకన తిరుమలకు క్యూ కట్టిన యాత్రికులు
- పిండి దీపాలతో మొక్కులు చెల్లించుకున్న మహిళలు

తిరుపతి రూరల్ : తిరుమల శ్రీవారు అవతరించిన పరమ పవిత్రమైన పెరటాసి మాసం ఈనెల 17న ప్రారంభమైంది. అక్టోబరు 17వ తేదీ వరకు కొనసాగుతుంది. పెరటాసి మాసంలో శ్రీవారికి ప్రీతిపాత్రమైన శనివారాలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ముఖ్యంగా తమిళనాడుకు చెందిన భక్తులు ఈ మాసంలో వైకుంఠనాథుని దర్శనార్థం కాలినడకన తిరుమలకు వస్తుంటారు. నడవలేని వారు సమీపంలోని వైష్ణవ ఆలయాల సందర్శనతో మొక్కులు చెల్లించుకుంటారు. తమిళనాడు నుంచి ఊళ్లకు ఊళ్లు కాలినడకన బయలుదేరి తిరుమలేశుని దర్శించుకుని తలనీలాలు సమర్పిస్తారు. ఈ ఆచారం సుమారు వెయ్యేళ్లుగా సాగుతోందని చరిత్ర పేర్కొన్నారు. పరమ పవిత్రమైన పెరటాసి మాసంలో భక్తులు నియమ నిష్టలు పాటించాలని స్కంధపురాణం చెబుతోంది. ఈ క్రమంలోనే శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నందున శ్రీవారి తిరునాళ్ల మాసంగా కూడా పిలుస్తుంటారు. పెరటాసి మాసంలో మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వైష్ణవాలయాలకు చేరుకున్నారు. పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

తిరుపతి, చంద్రగిరి వాసులు పెరటాసి మాసం తొలి శనివారం సందర్భంగా అలిపిరి పాదాల మండపంతో పాటు తుమ్మలగుంట, శ్రీనివాస మంగాపురం, అప్పలాయిగుంట, నారాయణవనంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు పోటెత్తారు. ప్రధానంగా అలిపిరి వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పిండి దీపాలు వెలిగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం పాదాల మండపంలో కొలువైన శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి తిరుపతి నగరంతోపాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు భారీ తరలివచ్చారు. మహిళలు ధ్వజస్తంభం చుట్టు పిండి దీపాలను వెలిగించి శ్రీవేంకటేశ్వర స్వామి శతనామావళిని పఠించారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశారు. సుప్రభాతం నుంచి ఏకాంత సేవ వరకు భక్తులందరికీ అన్న ప్రసాదాలను వితరణ చేపట్టారు.

నోటీస్ బోర్డు

- ఎన్‌జీఓ కాలనీలోని అరవిందో ఆశ్రమంలో ఉదయం 8.30 గంటలకు స్వరభారతి.
- చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో ఉదయం 11 గంటలకు గురజాడ అప్పారావు జయంతి సభ.
- శ్రీకోదండరామాలయంలో ఉదయం 9 గంటలకు సహస్ర కలశాభిషేకం, రాత్రి 7 గంటలకు హనుమంత వాహన సేవ.

ఆలయాభివృద్ధికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న సుధారాణి

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధి పనులకు శ్రీసాయి సుధా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి శనివారం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మహేష్ యాదవ్‌కు నగదును అందజేశారు. ఈఓ జయకుమార్, అర్చకుడు రామకృష్ణస్వామి పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలకు వినతి



మాట్లాడుతున్న బాధితురాలు నిర్మల

తిరుపతి కల్చరల్ : పూర్వీకుల నుంచి తమ ఆధీనంలోని భూమిని కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌టీవీనగర్‌కు చెందిన బాధితులు నిర్మల, శశికళ, చలపతి కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఎస్టీవీనగర్ సమీపంలో సర్వే నంబర్ 72/1బీ2లో ఉన్న 43 సెంట్ల భూమి తమ ముత్తాతల నుంచి సంక్రమించిందన్నారు. అందులో 14 సెంట్లు రోడ్డుకు పోగా మిగిలిన 29 సెంట్లు తమ ఆధీనంలోనే ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించిన పత్రాలు ఉన్నాయని, ఇప్పటికీ రెవెన్యూ రికార్డులలో తమ పేరుమీదే సదరు భూమి ఉందని వెల్లడించారు. అయితే 2006లో చంద్రశేఖర్ అనే వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి భూమిని నెల్లూరుకు చెందిన శ్రీకాంత్‌కు విక్రయించేశారని వాపోయారు. శ్రీకాంత్ ఈ భూమిని బ్యాంక్‌లో పెట్టి రుణం పొందడంతో ఆక్రమణ విషయం తెలిసిందన్నారు. దీనిపై 2022లో ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే ఈనెల 18వ తేదీన కొంత మంది తమ భూమిలో ప్రవేశించి అక్కడ ఉన్న నిర్మాణాలను జేసీబీతో కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్న కుమారుడు శివ, జనసేన నేత హరి పేర్లు చెబుతూ తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

పచ్చదనం.. పరిశుభ్రతే లక్ష్యం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పాకాల : పచ్చదనం.. పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రీన్ మాస్టర్ వనపర్తి వెంకటసిద్దులు తెలిపారు.శనివారం మొగరాల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుమలత ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడా నిర్వహించారు. స్వచ్ఛతపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు విమలా విక్టోరియా, ఆదిశేషవులు, సుల్తాన్, రామమూర్తి, బాబు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో....

ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన స్వచ్ఛత పక్వాడా నిర్వహించారు. ఎంపీడీఓ వాసుదేవరావు మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రతపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యాలయంలో ఆవరణలో మొక్కలు నాటారు.

ఆధ్యాత్మిక జీవనంతో దైవకృప

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక జీవనంతో దైవకృపకు పాత్రులవుతారని పలువురు వక్తలు తెలిపారు. శనివారం పీఎంసీ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో చేపట్టిన ధ్యాన మహాయజ్ఞం శనివారంతో ఐదవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సామూహిక అఖండ ధ్యానం నిర్వహించారు. పిరమిడ్ ఆస్థాన విద్వాంసుడు గణేష్ బృందం ప్రదర్శించిన అఖండ సంగీత నాద ధ్యానం ఆకట్టుకుంది. పిరమిడ్ మాస్టర్ వీరరాఘవరావు, పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు కంచి రఘురాం, ధ్యాన మహాయజ్ఞం వైస్ చైర్మన్ సంగీతబాబు, బ్రహ్మర్షి ప్రేమనాథ్ ఉపన్యసించారు. అనంతరం మహాయాగం బ్రోచర్లు ఆవిష్కరించారు. ట్రస్ట్ సభ్యులు హన్మంతరావు, బాలకృష్ణ, దామోదర్‌రెడ్డి, శివప్రసాద్, మాధవి పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్ : కొత్తవీధిలో వెలిసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పామిడి సత్యనారాయణ, ఉత్సవ కమిటీ కన్వీనర్ దిండుకుర్తి నరసింహులు తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు.వారు మాట్లాడుతూ ఉత్సవాల నేపథ్యంలో ప్రతి రోజు ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభిషేకం, అనంతరం నివేదన, ప్రత్యేక పూజలు జరిపించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవమూర్తిని ప్రతి రోజూ ప్రత్యేక అలంకరణలో కొలువుదీర్చనున్నట్లు వివరించారు. సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు శిరీష, శ్రీధర్, హేమరాజ్, రవిచంద్రశేఖర్, జీకే రాణి, వీవీ.గుప్తా, సతీష్ పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా : ఆర్‌సీ రోడ్డులోని ఈఎస్ఐ ఆస్పత్రిలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియన్ కింద గర్భాశయ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామ్‌బాబు, గైనకాలజీ స్పెషలిస్ట్ డాక్టర్. కె. పద్మావతి, ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పద్మహస్త, ఆర్ఎంఓ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు

ప్రత్యేక వైద్య శిబిరం

చంద్రగిరి : స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కింద మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు శానంబట్ల సర్పంచ్ యశోద తెలిపారు. శనివారం కొత్తశానంబట్లలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు కుసుమ, శిరీష, సూపర్‌వైజర్ వాసుదేవరెడ్డి, శ్యామల, ఎంఎల్‌హెచ్ మౌనిక, స్వప్న, ఏఎఎం పుష్పలత పాల్గొన్నారు.

ఘనంగా ఇస్తిమా



మత గురువుల ప్రసంగాలను వింటున్న ముస్లింలు

పాకాల : ఐటీఐ మైదానంలో ముస్లిం సోదరులు ఇస్తిమాను ఘనంగా నిర్వహించారు. శనివారం మొదటి రోజులో భాగంగా మత గురువులు ప్రత్యేకమైన ప్రార్థనలు నిర్వహించారు. రుచికరమైన వంటకాలను సిద్ధం చేసి వడ్డించారు.

మెకానిక్‌కు ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మెకానిక్ దామోదర్‌రెడ్డికి తిరుపతి టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు ప్రభు, సహాయ కార్యదర్శి తేజారెడ్డి, కోశాధికారి బాబు, కమిటీ ఇన్‌చార్జి కేశవ పాల్గొన్నారు.

నేడు కపిలతీర్థంలో పితృతర్పణాలు

తిరుపతి కల్చరల్ : మహాలయ అమావాస్య సందర్భంగా కపిలతీర్థంలో శనివారం రాత్రి 3 నుంచి ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు పితృ తర్పణాది పిండ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పురోహిత సేవా సంఘం గౌరవ సలహాదారుడు సంస్కార్ రాజేష్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పిండ ప్రదానాలకు తర్పణ పురోహితులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. అన్నదాన అనిల్‌కుమార్, పారా విజయకుమార్, కోడూరు గౌతమ్ శర్మ, చింతలపూడి సాయికృష్ణ శర్మ, రామకృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినుల ఇండస్ట్రియల్ విజిట్



విజిట్‌కు వెళ్లిన వర్సిటీ విద్యార్థినులు

తిరుపతి రూరల్ : పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థులు శనివారం రేణిగుంట వద్దనున్న దక్షిణ మధ్య రైల్వే క్యారేజ్ రిపేర్ షాపునకు ఇండస్ట్రియల్ విజిట్‌కు వెళ్లారు. ప్రొఫెసర్ పి.మల్లికార్జున , కోఆర్డినేటర్ పి.స్నేహలత మాట్లాడుతూ ఇక్కడి పనులను పరిశీలించడం వల్ల విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. బోగీ అసెంబ్లీ, వీల్సెట్ రీకండిషనింగ్, వెల్డింగ్ కార్యకలాపాలు వంటి అనేక విభాగాలను పరిశీలించారు.

అనధికారిక భవనాలపై చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలో అనధికారిక భవనాల తొలగింపునకు చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శనివారం పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అనధికారిక భవన నిర్మాణాలను ఆయా వార్డుల్లోని కార్యదర్శులు పరిశీలించి మొదటి దశలోనే నిలుపుదల చేయాలని, అక్రమ లే అవుట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎక్కడైనా అనుమతులు లేని భవన నిర్మాణాలు జరిగితే సంబంధిత కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్మాణాలను తొలగించే విషయంలో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే పుట్ పాత్ ఆక్రమణలు తొలగించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే వెంటనే తొలగించాలని సూచించారు. పెండింగ్‌లోని ప్రకటనల పన్నులు త్వరగా వసూలు చేయాలని చెప్పారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీ ఖాన్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



విద్యార్థులతో శేషారెడ్డి తదితరులు

తిరుపతి రూరల్ : బీహార్‌లో ఈనెల 13 నుంచి 17 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి సీబీఎస్ఈ క్లస్టర్స్ అండర్–17 బాలుర కబడ్డీ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచిన వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులను విద్యాసంస్థ చైర్మన్ శేషారెడ్డి శనివారం అభినందించారు. కబడ్డీ కోచ్‌లైన శంకర్, నరేష్‌ను ప్రశంసించారు. స్కూల్ డైరెక్టర్ బి. శ్రీకర్‌రెడ్డి, డీన్ సీజీహెచ్ ఖాన్, ప్రిన్సిపల్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపల్‌నాగార్జున పాల్గొన్నారు.

టీటీడీకి ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళం



వాహనం అందిస్తున్న దాత

తిరుమల: హైదరాబాద్‌కు చెందిన బిగాస్ ఆటో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శనివారం రూ.1.10 లక్షలు విలువైన బిగాస్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను టీటీడీకి విరాళంగా అందించింది. ఈ మేరకు శ్రీవారి ఆలయం ఎదుట ఏఈవో మోహన్ రాజుకు ఆ సంస్థ ఆర్ఎస్ఎం కె.రామారావు స్కూటర్ తాళాలు అందించారు.

ఆన్‌కాల్ డ్రైవర్లుగా వచ్చేస్తాం

తిరుపతి అర్బన్ : శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శనివారం జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో అద్దెబస్సుల డ్రైవర్లతో డీపీటీఓ జగదీష్ సమీక్షించారు. డ్రైవర్లు మాట్లాడుతూ ఆర్టీసీలో రోజు వారీ వేతనంతో డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని...అద్దె బస్సులను వదిలిపెట్టి తాము వచ్చేస్తామని తెలిపారు. ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లకు 8 గంటల డ్యూటీకి రూ.1000, 12 గంటల డ్యూటీకి రూ.1500 ఇస్తున్నారని చెప్పారు. డీపీటీఓ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల కారణంగా అద్దె బస్సుల డ్రైవర్లు పూర్తిగా సహకారం అందించాలని కోరారు.తర్వాత ఒక్కో సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ



సరోజనమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న హర్షిత్‌రెడ్డి



రమేష్ రెడ్డి పార్థివ దేహానికి అంజలి ఘటిస్తూ..

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గంలో రెండు కుటుంబాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలను పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఎర్రావారిపాళెం మండలం కమలయ్యగారిపల్లె పంచాయతీ తెట్టుపల్లెకు చెందిన వార్డు సభ్యుడు దామోదర్ తల్లి సరోజనమ్మ మృతి చెందారు. వారి నివాసానికి హర్షిత్‌రెడ్డి వెళ్లి సరోజనమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. నేతలు నాగార్జునరెడ్డి, చెంగల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, హరినాథరెడ్డి, దేవేంద్ర, రమేష్, సునీల్, వెంకటసిద్దులు, వెంకట రామిరెడ్డి, రమేష్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీ సత్తారుబైలుకు చెందిన బచ్చల రమేష్‌రెడ్డి మృతి చెందారు. ఆయన పార్థివదేహానికి హర్షిత్‌రెడ్డి పుష్పాంజలి ఘటించారు. కుటుంబీకులను పరామర్శించారు. నేతలు సిద్ధారెడ్డి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

శ్రీహరీ.. మారదా టీటీడీ వైఖరి!





భక్తులకు సులభతరంగా శ్రీవారి దర్శనం కల్పించడంపై టీటీడీ శీతకన్ను వేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల కోసం జరిగిన విషాద ఘటన నుంచి సైతం ఇప్పటికీ పాఠాలు నేర్చుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. శనివారం అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద దివ్యదర్శనం టోకెన్ల కోసం భక్తుల ఇక్కట్లను చూసి నగరవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భక్తుల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారని మండిపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

స్వచ్ఛత.. మన బాధ్యత

మానవ మనుగడకు చెట్లు అవసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పలువురు అధికారులు, అధ్యాపకులు కోరారు. శనివారం స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎస్వీడబ్ల్యూ కళాశాల, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్వీయూ, మెప్మా కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. వేలాది మొక్కలను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తిరుపతిని తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

– తిరుపతి సిటీ/ తిరుపతి తుడా



ఎస్వీయూలో మొక్క నాటుతున్న వీసీ అప్పారావు తదితరులు



ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో..



మొక్కలు పంపిణీ చేస్తున్న కమిషనర్ మౌర్య